క్లుప్తంగా

చురుగ్గా అభివృద్ధి పనులు



ఆదర్శనగర్‌లో కొత్తగా వేస్తున్న సీసీ రోడ్డు

రాజాం: స్థానిక పట్టణంలోని ఆదర్శనగర్‌లో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రూ.6.9 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, కాలువల నిర్మాణం శుక్రవారం ప్రారంభించారు. 450 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు ఏఈ భాగ్యలక్ష్మి తెలిపారు.

అఖండ దీపారాధన



దీపారాధన చేస్తున్న భక్తులు

సంతకవిటి: కార్తీకమాస పూజల్లో భాగంగా మండలంలోని మందరాడ గ్రామంలో ముఖలింగేశ్వర, షిర్డీసాయి, సంతోషిమాత, త్రినాథస్వాముల ఆలయ ఆవరణలో అఖండ దీపారాధన శుక్రవారం చేపట్టారు. లింగాకారం, త్రిశూలం, ఓంకారం, కమలం తదితర ఆకారాల్లో 10,108 దీపాలు వెలిగించారు. దీపాల వెలుగుల్లో మెరిసిపోయిన ఆలయాన్ని చూసేందుకు భక్తులు పోటీపడ్డారు. కార్యక్రమంలో గ్రామ పురోహితులు పులఖండం శ్రీనివాసరావుశర్మ తదితరులు పాల్గొన్నారు.

చోడిసాగుపై అవగాహన

రాజాం సిటీ: చోడిసాగుపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని విజయనగరం డీఏటీటీసీ సెంటర్ సైంటిస్ట్ కో–ఆర్డినేటర్ కె.లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బొద్దాం గ్రామంలో రైతులకు చోడిసాగుపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో పండించే ఈ పంటను రైతులు పండించి, అధిక దిగుబడి, లాభాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ కె.చంద్రరావు, ఏవో ఎం.రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస, అంబఖండి, బూరాడ గ్రామాల్లోని రైతులకు రబీ సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏవో మురళీకృష్ణ సూచనలు, సలహాలు చేశారు. రబీ సాగుకు సంబంధించి, మడ్డువలస ప్రాజెక్ట్ నుంచి నీటిని అందిస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

దరఖాస్తుల పరిశీలన

రేగిడి: వైఎస్సార్ కల్యాణమస్తు పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను మండలంలోని లచ్చారాయపురం, మజ్జిరాముడుపేట గ్రామాలకు ఏపీఎం పి.గోవిందరావు శుక్రవారం వెళ్లి, పరిశీలించారు. దరఖాస్తుదారులు ఎంతమేర నిజమైన అర్హులన్న విషయం తెలుసుకునేందుకే ఇంటింటికీ వెళ్లి, దరఖాస్తులు, వారి వివరాలు సరిచూస్తున్నట్లు ఏపీఎం తెలిపారు.

26, 27 తేదీల్లో చలో విజయవాడ

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలతో పలువురు వర్కర్లు రోడ్డున పడతారని, దీనికి నిరసనగా ఈ నెల 26, 27 తేదీల్లో విజయవాడలో నిర్వహించే ధర్నాకు తరలి రావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లు ఇవ్వలేదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్, జిల్లా నాయకులు పొట్నూరు శంకరరావు, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘ నాయకురాలు రౌతు సత్యవతి, ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు లంక శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించిన రీజనల్ ఫైర్ ఆఫీసర్



సిబ్బందికి సూచనలు చేస్తున్న అగ్నిమాపక ప్రాంతీయాధికారి

బొబ్బిలి : పట్టణంలోని అగ్నిమాపక కేంద్రాన్ని ప్రాంతీయ అగ్నిమాపకాధికారి నిరంజన్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫైర్‌మన్ డ్రిల్‌ను తనిఖీ చేశారు. వారి ఫిట్‌నెస్‌ను నిత్యం సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. అగ్నిప్రమాద నివారణలో అధునాతన సూచనలను, నియమ నిబంధనలను పాటించాలని ఆదేశించారు. సిబ్బంది ఉన్నారు.

ఎస్ఈబీ తనిఖీలు

బొబ్బిలి: ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మద్యం, గంజాయి అక్రమ రవాణా జరగకుండా నిరోధించేందుకు పట్టణ శివారులో ఎస్ఈబీ శుక్రవారం తనిఖీలు చేపట్టింది. సీఐ ఆర్ జైభీమ్ ఆధ్వర్యంలోని సిబ్బంది తనిఖీలు చేపట్టారు. పాత బొబ్బిలి హనుమాన్ జంక్షన్ వద్ద వివిధ రకాల వాహనాలను నిలిపివేసి తనిఖీలు చేపట్టారు. ఏ విధమైన అక్రమ రవాణాలు జరగలేదని సీఐ తెలిపారు.

వైఎస్సార్ సీపీతోనే ప్రజలకు మేలు

వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి) కార్యక్రమంతో జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో గ్రామాలు హోరెత్తుతున్నాయి. ప్రభుత్వం చేసిన మేలును వివరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో శుక్రవారం పార్టీ నేతలు ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లుగా జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డులు, పార్టీ జెండాలు ఆవిష్కరించారు. గతంలోని టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, మేలు జరిిందంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి, పార్టీని గెలిపించాలని కోరుతున్నారు. ఏ ఇంటికి వెళ్లినా, ఎవరినడిగినా జగనన్నే మళ్లీ మళ్లీ సీఎం కావాలని జనం కోరుకుంటుండడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపుతుండడం విశేషం. –సాక్షి నెట్‌వర్క్.



రేగిడి: ఆమదాలవలస సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీ జగన్మోహనరావు



రాజాంలోని ఆదర్శనగర్‌లో రాత్రి బసలో నిద్రిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు



రాజాం: రాజాం పట్టణంలోని ఆదర్శనగర్‌లో పార్టీ జెండా ఎగురవేసిన పార్టీ టౌన్ కన్వీనర్ శ్రీనివాసరావు



సంతకవిటి: బొద్దూరులో జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది



రాజాం సిటీ: ఆగూరు సచివాలయం వద్ద ప్రదర్శించిన సంక్షేమ పథకాల బోర్డు వద్ద ప్రజాప్రతినిధులు



వంగర: పటువర్ధనంలో ప్రభుత్వ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ సుదర్శనరావు



మెంటాడ: ఇప్పలవలసలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరిస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు

పక్కాగా రికార్డుల నిర్వహణ



మాట్లాడుతున్న వెలుగు ఏసీ చిరంజీవి

వంగర: గ్రామైక్య సంఘాల రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, రికార్డుల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని రాజాం వెలుగు కో–ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి అన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు మండలంలోని ఉన్న 30 గ్రామైక్య సంఘాల రికార్డుల నిర్వహణపై జరిగిన అంతర్గత ఆడిట్‌పై స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామైక్య సంఘాల ద్వారా మహిళలకు రుణాలు మంజూరు, చెల్లింపులు, లావాదేవీలు సకాలంలో చేయాలని సూచించారు. సంఘ సభ్యులు చెల్లించిన అప్పులు వారి ఖాతాలకు మళ్లించాలని, ఇతర ఖాతాలకు మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీవోఏలు పుస్తక నిర్వహణ, డీసీబీ డిమాండ్ మేరకు చెల్లింపులు, బకాయిలు సకాలంలో చెల్లింపులు, లోన్‌లెడ్జర్ సక్రమంగా నిర్వహించాలని, నగదు పుస్తకాల్లో వ్యత్యాసం లేకుండా సరిచూసుకోవాలన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 22వ తేదీ వరకు నాలుగు వారాల పాటు లింగ వివక్షతపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంలు మీసాల చక్రపాణి, టి.మంగమ్మ, సీసీలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



బూసాయవలసలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని బూసాయవలస గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమెల్యే శంబంగి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ప్రజలు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కారించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో లక్షలాది రూపాయలు వెచ్చించి సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రతి గడపలో సంతోషాన్ని నింపారన్నారు. సాధికార యాత్రలో జన సంద్రం చూసి టీడీపీ నాయకులు బెంబేలెత్తిపోతున్నారన్నారు. సామాజిక సాధికార యాత్రలో వేలాదిగా వచ్చిన ప్రజాస్పందనతో బొబ్బిలి రాజులకు వణుకు ప్రారంభమైందన్నారు. మేలు చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ దీవించాలని కోరా రు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, బొబ్బిలి మండల ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, మండల పార్టీ కన్వీనర్ ఎ.లక్ష్మంనాయుడు, జెడ్పీటీసీ ప్రతినిధి ఎ.నిర్మల, సీనియర్ నాయకులు గంట సత్యనారాయణ, గంట పోలినాయుడు, కనిమెరక గణేష్, ఉమ్మిరెడ్డి గోవిందరావు పాల్గొన్నారు.

గ్రామసభల్లో ఉపాధి పనులు గుర్తించాలి

రాజాం: అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి, ఉపాధి హామీ పనులు గుర్తించి, పంచాయతీ పాలకమండలి ఆమోదం పొందేలా చూడాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, గ్రామాల్లో చేయనున్న ఉపాధి పనులకు సంబంధించి, ఇప్పటికే కొన్ని పనులు గుర్తించడం జరిగిందన్నారు. రైతులు, వేతనదారులతో కూడా సమావేశాలు నిర్వహించి, అందరికీ ఉపయోగపడే చోట్ల పనులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శంకరరావు

‘అంగన్‌వాడీ’ల అభివృద్ధికి పెద్దపీట

రామభద్రపురం: అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి కోసం మంజూరైన నిధులు, కేంద్రాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీల ఏర్పాటుపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శుక్రవారం ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 27 అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించనుందని తెలిపారు. ఇందుకోసం నాడు–నేడు పథకం ఫేజ్ 2 బీ కింద రూ.38.76 లక్షలు నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో ఆయా కేంద్రాలలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, పెయింటింగ్ వంటి మౌలిక వసతులతో పాటు మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉందన్నారు. రామభద్రపురం అంగన్‌వాడీ కేంద్రం–2, మిర్తివలస అంగన్‌వాడీ కేంద్రాలను రూ.8.50 లక్షలతో అభివృద్ధి చేయాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, కమిటీల ఆధ్వర్యంలోనే ఆధునీకరణ పనులు చేపట్టాలని తెలిపారు. ఐసీడీఎస్ సైపర్‌వైజర్లు కె. రత్నకుమారి, పి.కృష్ణకుమారి, టీఎస్ కుమారి పాల్గొన్నారు.



ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

యాత్రలో భాగస్వాములైన అందరికీ కృతజ్ఞతలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: బొబ్బిలి శ్రీ కళాభారతి రోడ్డులో అశేష జనవాహిని మధ్య ఈ నెల 23న జరిగిన సామాజిక సాధికార యాత్రను దిగ్విజయం చేసిన కార్యకర్తలు, ప్రజలు, నాయకులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని గోపాలరాయుడిపేటలో ఆయన విలేకర్లతో శుక్రవారం మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సామాజికంగా చేసిన అభివృద్ధిని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కల్పించిన సాధికారతను, రాజకీయ పార్టీల రహితంగా సంక్షేమ పథకాల అమలును వివరించేందుకు ప్రతీ నియోజకవర్గంలోనూ సామాజిక సాధికార బస్సు యాత్రను చేపడుతోందన్నారు. ఈ బస్సు యాత్రను బొబ్బిలి చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేశారన్నారు. ఉత్తరాంధ్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పదవులు, ఎమ్మెల్యే సీట్లు, వివిధ కార్పొరేషన్ పదవులు కట్టబెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆయన వెంట జేసీఎస్ మండల కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు, శంబంగి వేణుగోపాల నాయుడు, ఎంపీపీ లక్ష్మి, జడ్పీటీసీలు శాంతకుమారి, పెద్దింటి రామారావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, యువ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

ఆలయ నిర్మాణం ప్రారంభం

రాజాం: మండలంలోని మెంతిపేట గ్రామం వద్ద మృత్యుంజయ ఆలయ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రూ.50 లక్షల వ్యయంతో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి



కందిశలో సారా తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

రేగిడి: మత్తుపదార్థాలకు దూరంగా ఉండి, ఆరోగ్యం కాపాడుకోవాలని ఎస్ఈబీ ఎస్ఐ ఎం.శ్రీనివాసరెడ్డి యువతకు సూచించారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా మండలంలోని కందిశ గ్రామంలో సారా నిషేధంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన సారా, మద్యం, పొగాకు తాగడం వల్ల కలిగే అనర్థాలతో పాటు ఖైనీ, గుట్కా, గంజాయి తీసుకోవడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కెల్ల మన్మధరావు, రేగిడి పీఏసీఎస్ అధ్యక్షుడు వంజరాపు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

26న రారవే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో ఈ నెల 26వ తేదీన రాజాం రచయితల వేదిక(రారవే) 106వ సమావేశం నిర్వహించనున్నామని రారవే నిర్వాహకులు గార రంగనాథం శుక్రవారం వెల్లడించారు. పొదిలాపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ‘మల్లిపురం జగదీష్ కథలు–గిరిజన జీవనం’ అనే అంశంపై సాహితీవేత్త ఆల్తి మోహనరావు ప్రసంగించనున్నారన్నారు. ఈ సమావేశానికి రచయితలు, కవులు, భాషాభిమానులు తదితరులు హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఏకాహభజనలు



భజనలో పాల్గొన్న భక్తులు

రాజాం: స్థానిక సంతమార్కెట్‌లోని కల్యాణగౌరీ మల్లిఖార్జునస్వామి ఆలయంలో ఏకాహ భజనలు శుక్రవారం చేపట్టారు. ఏకాదశి సందర్భంగా గురువారం ప్రారంభించిన ఈ శివపంచాక్షరీనామ భజన కార్యక్రమం శుక్రవారం ఉదయం వరకు 24 గంటల పాటు కొనసాగింది. మల్లిఖార్జునకాలనీ, రాణావీధి, లచ్చయ్యపేట గ్రామాలకు చెందిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, భగవంతుడిని ఆరాధించారు.

సైన్స్ టీచర్‌కు సన్మానం

రేగిడి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు బూరవెల్లి ఉమామహేశ్వరిని హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు శుక్రవారం సత్కరించారు. విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పించడంతో పాటు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు పొందినందుకు గాను ఆమెను అభినందించి, సన్మానించారు.

పంట కోత ప్రయోగాలతో మేలు

బాడంగి: పంటకోత ప్రయోగాలతో పంటల దిగుబడులు లెక్కింపుతో పాటు రైతు ఉత్పత్తి చేస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు, నష్టపోయిన వారికి పరిహారంతో పాటు బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని ఏఓ కె.శిరీష చెప్పారు. మండలంలోని పిన్నవలసలో వరిపంట కోత ప్రయోగం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 63 ప్రయోగాలు చేయవలసి ఉండగా ఇప్పటి వరకు 27 ప్రయోగాలు చేసినట్టు చెప్పారు. పంటల దిగుబడులు బాగానే ఉన్నట్టు చెప్పారు. వరి చేలు కోతల సమయంలోన కోసిన తరువాత రబీ సీజన్‌లో నాటుకొనేందుకు వీలుగా రబీ వరి, పెసలు, మినుములు, వేరుశనగ, రాగులు, కట్టెజనుము విత్తనాలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఆర్‌బీకేలలో ఇప్పటికే మినుములు మినహా అన్ని విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని అవసరమైన రైతులు కొనుగోలు చేసుకోవచ్చన్నారు.



పిన్నవలసలో వరి పంట కోత ప్రయోగం చేస్తున్న అధికారులు

వృత్యంతర శిక్షణ అంశాలను అమలు చేయాలి

బాడంగి: ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణలో నేర్చుకొన్న మెలకువలు, కొత్త విషయాలను పాఠశాలల్లో బోధన సమయంలో అమలు చేయాలని కోర్స్ డైరెక్టర్, హైస్కూల్ హెచ్ఎం డి.సత్యనారాయణ అన్నారు. స్థానిక హైస్కూల్‌లో రెండు రోజుల పాటు జరిగిన అభ్యసనాభివృద్ధి నాన్ లాంగ్వేజెస్ వృత్యంతర శిక్షణ ముగింపు సమావేశం శుక్రవారం జరిగింది. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి కనుక కొత్తకొత్త విషయాలను నిత్యం నేర్చుకోవాలన్నారు. తెర్లాం, బాడంగి మండలాలకు చెందిన 50 మంది ఎస్ఏ, పీఎస్ సబ్జెక్ట్ టీచర్లు శిక్షణలో పాల్గొన్నారు. రిసోర్స్‌పర్సన్లుగా ఐవీ ప్రసాద్, డి.రమేష్ వ్యవహరించారు.



శిక్షణ ముగింపులో మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్

పంటనూర్పిడిలో జాగ్రత్తలు పాటించాలి

రాజాం: వరిపంట నూర్పిడిలో జాగ్రత్తలు పాటించాలని ఏవో ఎ.రేణుకాసాయి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పొగిరి, బొడ్డవలస, నందబలగ, లక్ష్మీపురం గ్రామాల్లో పర్యటించిన ఆమె రైతులు పంటను నూర్పిడి చేయడం, ధాన్యం సేకరించడం వంటి వాటిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు మాత్రమే ధాన్యం విక్రయించాలని, దళారులను ఆశ్రయించవద్దన్నారు. ప్రభుత్వం ఏ–గ్రేడు రకం ధాన్యానికి క్వింటాకు రూ.2203, సాధారణ రకానికి రూ.2183లు చెల్లిస్తుందన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ–క్రాప్ నమోదు చేసిన రైతుల వివరాలు ఉన్నాయని, వారికి నేరుగా ట్రక్‌షీట్లు అందించడం జరుగుతుందన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి విక్రయాలు చేయాలన్నారు.



నందబలగలో వరినూర్పిడిని పరిశీలిస్తున్న ఏవో రేణుకాసాయి

ఆర్‌బీకేలతోనే సమగ్ర వ్యవసాయం

- ఆర్‌బీకేలను ప్రారంభించిన ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనల్లోంచి పుట్టిన సచివాలయ వ్యవస్థలోని రైతు భరోసా కేంద్రాలలో సమస్త వ్యవసాయ విజ్ఞానం అందుబాటులో ఉంటుందని వ్యవసాయ పనులు మినహా మిగతా సమయాల్లో ఆర్‌బీకేల్లోని స్క్రీన్‌ల వద్ద మరింత సమాచారం తెలుసుకునేందుకు రైతులు చొరవ చూపాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పక్కి, దిబ్బగుడ్డి వలస, గోపాలరాయుడిపేట గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలరాయుడిపేటలో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో మాట్లాడుతూ గతంలో వడ్డీలకు అప్పులు తెచ్చిన వారికే పండించిన ఉత్పత్తులను విక్రయించుకోవాల్సి వచ్చేదన్నారు. ఎరువులు, క్రిమి సంహారకాలు కావాలంటే పట్టణంలోకి వెళ్లి ధర్నాలు చేసి, లాఠీ దెబ్బలు తిని వచ్చే పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా కాకుండా స్వగ్రామంలోని ఆర్‌బీకేల్లో ధాన్యం విక్రయించుకునే అవకాశం దక్కిందన్నారు. అలాగే స్వగ్రామాల్లోనే రైతులకు ఎరువులు అందుతున్నాయని చెప్పారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి, బొబ్బిలి, బాడంగి జెడ్పీటీసీలు సంకిలి శాంతకుమారి, పెద్దింటి రామారావు, జేసీఎస్ ఇన్‌చార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యాంసుందరరావు, పీఆర్ డీఈఈ సీహెచ్‌వి.అప్పారావు, సర్పంచ్‌లు గంట పైడిరాజు, చింతల రామారావు, ఉప సర్పంచ్ అల్లు రామ్మూర్తి, మర్రాపు చిన్నంనాయుడు, ఎంపీటీసీ సీతారాం, ఆర్‌బీకే సిబ్బంది ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



పక్కిలో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం



ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ సుదర్శనరావు

వంగర: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. శుక్రవారం మండలంలోని అరసాడ గ్రామంలో పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ అమలు చేసిన నవరత్నాలు(పథకాలు)పై ప్రజలకు అవగాహన కలిగిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ కె.ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, సర్పంచ్‌లు ఎల్.సత్యనారాయణ, బి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.